క్లుప్తంగా

'ఏకలవ్య' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకువాలీలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఈఎంఆర్ఎస్ స్టేట్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్‌లో మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. వీరిలో కనమనంబేడు ఏకలవ్య గురుకుల పాఠశాల నుంచి 30 విద్యార్థులు వివిధ విభాగాల్లో పాల్గొని, ఆరు విభాగాల్లో బహుమతులు సాధించారని ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ సోమవారం తెలిపారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆయన అభినందించారు.

ఆర్డీఓగా భానుప్రకాష్‌రెడ్డి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్డీఓగా భానుప్రకాష్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగులు, సిబ్బంది ఆయనను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన తనకు శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆర్డీఓగా పనిచేసే అవకాశం లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం


రిటైర్డ్ ఏఈ సుబ్రమణ్యంను సన్మానిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సుబ్రమణ్యంను అధికారులు, ఉద్యోగులు సన్మానించి వీడ్కోలు పలికారు. మంగళవారం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, పీఆర్ ఏఈ నాగరాజు, తోటి ఉద్యోగులు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది సుబ్రమణ్యంను శాలువతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు


కాలువలోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న జేసీబీ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మెయిన్‌రోడ్డులోని కాళంగి కుడి కాలువలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా గ్రీన్ అంబాసిడర్లతో పారిశుద్ధ్యం మెరుగు పరిచారు. కాలువలో షాపుల యాజమానులు చెత్తాచెదారం వేస్తుండడంతో కాలువ రూపురేఖలు మారిపోయి, దోమలకు ఆవాసంగా మారింది. ఈ నేపథ్యంలో కాలువను శుభ్రం చేశారు. దుకాణదారులు కాలువలో చెత్త వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'పిళ్లారి' సేవలు చిరస్మరణీయం


అన్నదానం చేస్తున్న పిళ్లారి ఫౌండేషన్ నిర్వాహకురాలు అమరావతి, ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి: పిళ్లారి ఫౌండేషన్ వ్యవస్థాపకులు దుర్గాప్రసాద్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. దుర్గాప్రసాద్ 4వ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం స్థానిక బజారువీధిలో పిళ్లారి ఫౌండేషన్ పేదలకు అన్నదానం చేసింది. పిళ్లారి దుర్గాప్రసాద్ చేసిన సామాజిక సేవలు చిరస్మరణీయమని కోలా ఆనంద్ అన్నారు. పిళ్లారి బాటలోనే ఆయన కుమార్తె అమరావతి కూడా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శుక బ్రహ్మాశ్రమ మేనేజర్ ఈశ్వర్‌స్వామి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ


గెలుపొందిన తపస్య స్కూల్ విద్యార్థులు

రేణిగుంట: ప్రపంచ అంతరిక్ష వారోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని వెంకటాపురం పంచాయతీ ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో స్థానిక డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యాసంస్థల అధినేత విక్రమ్ శాలీ మంగళవారం తెలిపారు. శ్రీహరికోట ఇస్రో సంస్థ నిర్వహించిన ఈ పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను తమ విద్యార్థులు గెలుపొందారని చెప్పారు. వారిని స్కూల్ డైరెక్టర్ కె.అనూష అభినందించారు.

పచ్చ నేతల కిక్ పాలసీ..!

నూతన మద్యం పాలసీతో ఆదాయం గణనీయంగా పెంచుకోవాలని ప్రభుత్వం యత్నిస్తూంటే, తమదైన మద్యం పాలసీతో టీడీపీ నేతలు తమ జేబులు నింపుకునేందుకు స్కెచ్ వేశారు. తాముగానీ, తాము చెప్పిన వారు కాకుండా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఎవరు మద్యం దుకాణాలు వేసినా ఆ తర్వాత ఇబ్బందులు చవి చూడక తప్పదని ఆశావహులకు వార్నింగ్ ఇవ్వడంతోపాటు బెదిరింపులకు దిగడంతో మద్యం షాపులకు దరఖాస్తులు వేసేందుకు ఎవరూ ధైర్యం చేయడం లేదు. ఈ పరిణామాలతో మద్యం షాపులు ఎవరికొస్తాయనేది చర్చనీయాంశమైంది.

- ఆశావహులకు పచ్చనేతల వార్నింగ్
- టెండ'రింగ్'కు నేతల స్కెచ్
- మద్యం షాపులకు దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు వెనుకడుగు



టెండరుదారుల కోసం వేచి చూస్తున్న ఎక్సైజ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 30 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. పట్టణానికి 12 దుకాణాలు కేటాయించగా ఇప్పటి వరకు 33 మాత్రమే దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. వీటిలో ఆరు దుకాణాలకు రెండేసి చొప్పున 12 దరఖాస్తులు వచ్చాయి. దుకాణానికి సరాసరి 5 దరఖాస్తులు కూడా రాలేదంటే బెదిరింపులు ఏస్థాయిలో ఉన్నాయో ఇట్టే అర్థమవుతోంది. గతంలో ఒక దుకాణానికి కనీసం 25 వరకు దరఖాస్తులు వచ్చేవి. అయితే బుధవారం చివరి రోజు కావడంతో ఎన్ని వస్తాయనేది ఆసక్తికరంగా మారింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి సంబంధించి 5 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 15 దరఖాస్తులు, తొట్టంబేడు మండలానికి సంబంధించి మూడు దుకాణాలకు 13 దరఖాస్తులు, ఏర్పేడు మండలం 7 దుకాణాలకు 27 దరఖాస్తులు వచ్చాయి. ఇక, కేవీబీపురం మండలానికి సంబంధించి మూడు దుకాణాలకు 39 అర్జీలు రావడం గమనార్హం! ఈ స్థాయిలో శ్రీకాళహస్తిలో, తొట్టంబేడు వస్తాయని భావించినప్పటికీ ఇక్కడ టీడీపీ నాయకులే చక్రం తిప్పుతుండటం, బెదిరింపుల కారణంగా మద్యం వ్యాపారులు టెండర్లు వేయలేని పరిస్థితి ఉంటోంది. ఒక దుకాణానికి 20 టెండర్లు వచ్చినా 30 దుకాణాలకు 600 దరఖాస్తులు వస్తాయని ఆశించిన సంబంధిత అధికారులకు ఇక్కడి పరిస్థితులు నీరుగారుస్తున్నాయి. ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎవరైనా టెండర్లు వేసేందుకు వస్తే అడ్డగించేందుకు కూటమి నాయకులు ఎవరైనా యత్నిస్తున్నారా? అనే దిశగా వారి వివరాలను సేకరిస్తున్నట్టు తెలియవచ్చింది.

పారదర్శకంగా టెండర్లు



మద్యం పాలసీని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నాం. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. బుధవారం సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. ఎవరైనా నిరభ్యంతరంగా సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదైనా సమస్య ఉంటే నిరభ్యంతరంగా సంప్రదించవచ్చు. 12న కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా దుకాణాలను కేటాయిస్తారు. 35 వార్డుల్లో ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చు.
– లావణ్య, ఎక్సైజ్ సీఐ



బ్రహ్మోత్సవాల్లో నేడు

తిరుమల: తిరుమలలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజు బుధవారం ఉదయం హనుమంత వాహనంపై ఊరేగుతారు, రాత్రి గజ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. సాయంత్రం స్వర్ణ రథం (రథరంగ డోలోత్సవం) ఊరేగింపు నిర్వహిస్తారు.

కొత్త పింఛన్ల సంగతేంటి బాబూ..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో నాయకులు ఊదరగొట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులు దాటింది. ఇంతవరకు కొత్త పింఛన్ల మంజూరు ఊసేలేదు. అటు కొత్త పింఛన్ల కోసం సచివాలయ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా వారి గోడు పట్టించుకునే నాథుడే లేరు.

- అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లకు కూటమి హామీ
- ఇప్పటికీ తెరచుకోని పింఛన్ల వెబ్‌సైట్
- అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అర్హులు
- 9,872..మంది సామాజిక పింఛనుదారులు ఉన్నారు


మండలంలోని ఆమందూరు లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏర్పేడు: సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. రూ.4వేల పింఛను ఇవ్వడం తప్పితే మరే ఇతర హామీలనూ నెరవేర్చకపోవడంతో ప్రజలు తమ నెత్తిన గుడ్డేసిందని ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ప్రధానంగా పింఛన్లు మంజూరు చేయండి సారూ! అంటూ దివ్యాంగులు, వితంతువు, వృద్ధులు నిత్యం ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం శూన్యం. గత ప్రభుత్వ పాలనలో అర్హులైన వ్యక్తులు గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే రాజకీయాలు, కులమతాలు, పార్టీలకు అతీతంగా కొత్త పింఛన్లు మంజూరు చేసేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

పింఛన్లు తొలగించే కుట్ర

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లు తొలగించాలని కూటమి ప్రభుత్వ నాయకులు పనికట్టుకుని చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అనర్హత పేరుతో పింఛన్లు తొలగించేందుకు ప్రయత్నాలకు పూనుకుంటున్నారు. దీనిపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

అర్హత ఉన్నా ఎదురు చూపులే

అర్హులైన దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు సచివాలయాలకు దరఖాస్తు చేసుకునేందుకు వెళుతున్నారు. అక్కడ కొత్త పింఛన్ల నమోదుకు సంబంధిత వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

వెబ్‌సైట్..సైలెంట్..!

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం నిత్యం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రతి ఆరునెలలకోసారి మంజూరు చేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా సాగేది. కానీ కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత ప్రభుత్వం పింఛన్లతో పాటు నూతన రేషన్ కార్డుల మంజూరు వెబ్ సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది.

మా గురించేమీ రాయొద్దు నాయనా..!

వారాల తరబడీ పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పడుతున్న ఇక్కట్లు, వారి గోడును 'సాక్షి' చాటి చెప్పే ప్రయత్నం చేసింది. అయితే పేపర్లో మాగురించి ఫొటోలు, పేర్లతో ఏమీ రాయొద్దు నాయనా..అది చూస్తే పింఛన్లు మాకు ఇవ్వరేమో నాయనా..దేవుడే చూసుకుంటాడు లే నాయనా..అని నిట్టూర్చారు. పింఛను మంజూరు చేయాలని సచివాలయాలకు వద్దకు అర్జీలతో వచ్చిన వారు మళ్లీ నిరాశతో ఇళ్లకు వెనుదిరిగారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రమణ్యం

వరదయ్యపాళెం: పంటల సాగులో యాజమాన్య పద్ధతులను అవలంబిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని సత్యవేడు సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం సీఎల్ఎన్‌పల్లి, కళత్తూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు వినియోగించాల్సిన మందుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పశుపోషణ గురించి పశుసంవర్ధక సహాయకులు మౌళి వివరించారు. కార్యక్రమంలో ఈఓ ద్వారకనాథ్, ఏఈఓ ప్రవీణ్, వ్యవసాయ సహాయకులు పద్మ, జ్యోతి, పవన్, పశుసంవర్ధకశాఖ సహాయకులు బాలముని తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన


నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు

వరదయ్యపాళెం: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవి మాట్లాడారు. ఉపాధి కల్పనకు కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కేంద్రం వేదికగా మారిందన్నారు. శ్రీసిటీకి చెందిన పలు పరిశ్రమలు, హీరో మోటారు పరిశ్రమ వారు డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పీజీ చదువుకున్న వారికి అర్హత బట్టి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి, శ్రీసిటీ ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, ఏపీఎం డాంగే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలతో లాభసాటి వ్యవసాయం


సమావేశంలో మాట్లాడుతున్న దివ్య

ఏర్పేడు: పంటల సాగులో రైతులు శాస్త్రీయ విధానాలను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్య అన్నారు. మంగళవారం మండలంలోని పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, వ్యవసాయంలో రైతులు సంప్రదాయ పద్ధతుల నుంచి ఆధునిక విధానాల వైపు మరలితే నష్టాల బారిన పడకుండా ఉంటారన్నారు. కొత్త వంగడాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, రాస్ ప్రతినిధులు వెంకట్‌కుమార్, మునేంద్ర, ముని పార్థసారథి, రైతులు పాల్గొన్నారు.

ముక్తి ప్రదాయినీ నమోస్తుతే..!


మహాలక్ష్మి అలంకారంలో పొన్నాలమ్మ, వ్యాఘ్రాసురవధ అలంకారంలో జ్ఞానప్రసూనాంబ, ఏర్పేడు: మర్రిమంద మాతాశ్రీ ఆశ్రమంలో..., రేణిగుంట: రామకృష్ణాపురంలో..., బొమ్మలకొలువులోని జ్ఞానప్రసూనాంబ


వరదయ్యపాళెం: అంబూరులో..., నారాయణవనం: అన్నపూర్ణాదేవిగా అవనాక్షమ్మ, మహాలక్ష్మిగా మూలస్థాన ఎల్లమ్మ, మహాలక్ష్మిగా ద్రౌపదీదేవి

శ్రీకాళహస్తి: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం అమ్మవార్లు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబిక అమ్మవారు వ్యాఘ్రాసుర వధ అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే బొమ్మలకొలువులో కాత్యాయనిదేవిగా కొలువుదీరారు. ఆలయంలోని కనకదుర్గమ్మ మహాలక్ష్మీదేవిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి శ్రీలక్ష్మీసమేత రంగనాథస్వామి అలంకారంలో, పానగల్ గంగమ్మ ప్రత్యేక అలంకారంలో, భాస్కరపేటలోని చాముండేశ్వరి స్కంధమాతగా, ముత్యాల్యమ్మ గుడిలోని ముత్యాలమ్మ, కొత్తపేటలోని శీతాలాంబ, బంగారమ్మ అమ్మవారు ప్రత్యేక రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద మాతాశ్రీ ఆశ్రమంలో మంగళవారం రాజరాజేశ్వరీ దేవి మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోబాకలో పోలినాంచారమ్మ, ఎండీపుత్తూరు యల్లమ్మ దేవి, పాతవీరాపురం చెంగాళమ్మ దేవి, పాపానాయుడుపేట భద్రకాళీదేవి, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని ఆనందవల్లీ దేవి, కందాడు కామాక్షి దేవి అమ్మవార్లు మహాలక్ష్మీ దేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

రేణిగుంటలో..

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లె పంచాయతీ రామకృష్ణాపురం అంకాల పరమేశ్వరి ఆలయంలో మంగళవారం లలితా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మహాలక్ష్మీదేవి అలంకరణలో శ్రీకామాక్షిదేవి

వరదయ్యపాళెం: మండలంలో అంబూరులోని శ్రీ కామాక్షిదేవి అమ్మవారు, మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాంబశివారెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. స్థానిక మహిళలు పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అన్నపూర్ణగా అవనాక్షమ్మ

నారాయణవనం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం సాయంత్రం సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు కరుమారియమ్మగా భక్తులకు ఉయ్యాలసేవలో దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి సర్కారు అభిషేకాన్ని నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే, కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో అమ్మవారు కంచి కామాక్షి అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు. తిరువట్యంలో మూలస్థాన ఎల్లమ్మ మహాలక్ష్మిగా కొలువుదీరారు. భక్తులకు నిర్వాహకులు, ఉభయదారులు అన్నప్రసాదాలను అందజేశారు. స్థానిక ధర్మరాజుల ఆలయంలో సాయంత్రం ద్రౌపదీదేవిని మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు.

● నృత్యం..మంత్రముగ్ధం


నృత్యం చేస్తున్న హర్షిత సూర్యకుమార్

శ్రీకాళహస్తి: శ్రీశీతాలాంబ ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాల సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా మంగళవారం హర్షిత సూర్యకుమార్ భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. పలు భక్తిపాటలకు చేసిన నృత్యం అలరించింది.

